క్లుప్తంగా

నేడు 4 గంటల పాటు విద్యుత్ కోత

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని 11 కేవీ ప్రజ్వల ఫీడర్ లైన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం 4 గంటల పాటు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు ఆమనగల్లు విద్యుత్ ఏఈ సీతారాం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ ఫీడర్ లైన్‌లో చెట్ల కొమ్మలు తొలగించడంతో పాటు మరమ్మతుల కారణాలతో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తట్టిఅన్నారంలోని జీవీఆర్ కాలనీ, ఆర్‌కెనగర్, తట్టి అన్నారం, తట్టిఖానా, మర్రిపల్లి, వనస్థలిహిల్స్, కుత్బుల్లాపూర్, తిమ్మాయిగూడ, హనుమాన్ నగర్, లక్ష్మీగణపతికాలనీ, సూర్యామిడోస్, రాఘవేంద్రకాలనీ, ఆర్ఎన్ఆర్‌కాలనీ ఫేజ్1,2, జీవీఆర్‌కాలనీ, జ్యోతిపురం, పల్లవి ఇంజనీరింగ్ కళాశాల పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పెద్దఅంబర్‌పేట ఏఈ చంద్రమౌళి తెలిపారు.

సమాన పనికి సమాన వేతనం

మాడ్గుల: సమగ్ర శిక్షలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులందరినీ విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని మాడ్గుల మండల సమగ్ర శిక్ష ఉద్యోగులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వాలకు ఎన్నో సార్లు విజ్ఞప్తి చేసిన పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని చట్టాలు చెబుతున్నాయని, అయినా అమలులో పాలకులు విఫలమవుతున్నారని విమర్శించారు.

మహేందర్ నియామకంపై హర్షం

ఆమనగల్లు: బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడిగా మహేందర్‌ను నియమించడంపై జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షుడు కండె సాయి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. మహేందర్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో బీజేవైఎం మరింత పటిష్టమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి సాయి కృతజ్ఞతలు తెలిపారు.

కల్యాణ్‌నాయక్‌కు సత్కారం



కల్యాణ్‌నాయక్‌ను సత్కరిస్తున్న బీజేవైఎం నాయకులు

ఆమనగల్లు: రాష్ట్ర బీజేపీ గిరిజన మోర్చా అధ్యక్షుడిగా నియమితులైన కల్యాణ్‌నాయక్‌ను బీజేవైఎం నాయకులు ఘనంగా సత్కరించారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం ఆయనను గిరిజన మోర్చా రాష్ట్ర నాయకులు కృష్ణ, రవినాయక్, రాజ్‌కుమార్, నాగేందర్‌నాయక్, కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ మీడియా ఇన్‌చార్జి రవిరాథోడ్ సత్కరించారు.

దశాబ్ది వేడుకలను జయప్రదం చేయండి

కడ్తాల్: వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం దశాబ్ది వేడుకలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఈశ్వరప్ప, రాష్ట్ర అధ్యక్షుడు సంగమేశ్వర్, మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, ఆర్. లక్ష్మణ్ ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని తెలిపారు.

పేదరిక నిర్మూలనే ధ్యేయం

కందుకూరు: దేశంలో పేదరిక నిర్మూలనే ధ్యేయంగా ప్రధాని మోదీ పని చేస్తున్నారని ఎంపీపీ మంద జ్యోతిపాండు తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని బాచుపల్లిలో సర్పంచ్ యాలాల శ్రీనివాస్‌తో కలిసి గ్రామంలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రకు సంబంధించిన నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం పంటలపై మందులు పిచికారి చేసే డ్రోన్ల ఏర్పాటును వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. 2047సంవత్సరం వరకు భారత దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలన్న ధ్యేయంతో మోదీ కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు విన్సెంట్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, గ్రామ పెద్దలు భూపాల్‌రెడ్డి, ఫాతిమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే సబితారెడ్డి రాక

కందుకూరు: మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి శనివారం కందుకూరులో నిర్వహించనున్న మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో పాల్గొనడానికి రానున్నట్లు జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30గంటల వరకు కందుకూరు చేరుకుంటారని ఆయన తెలిపారు.

రోడ్డు నిర్మాణ పనుల అడ్డగింత

- రైతులు, అధికారుల మధ్య వాగ్వాదం
- మహిళ ఆత్మహత్యాయత్నం.. అడ్డుకున్న పోలీసులు
- హైకోర్టు ఆదేశాలతో రోడ్డు వేస్తున్నామన్న అధికారులు



రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకుంటున్న స్థానికులు

తుర్కయంజాల్: మున్సిపాలిటీ పరిధిలోని ఇంజపూర్ నుంచి తొర్రూర్ వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణ పనులను తిరిగి ఆయా శాఖల అధికారులు చేపడుతుండగా శుక్రవారం వివాదం చోటు చేసుకుంది. రోడ్డు విస్తరణ పనులు తమ భూమిలో చేయవద్దని బొక్క గోపాల్‌రెడ్డి అనే రైతు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో అప్పటి నుంచి రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోయాయి. రోడ్డు పనులను 7 మీటర్ల వెడల్పుతో పూర్తి చేయాలని ఇటీవల హైకోర్టు ఉత్తర్వులను జారీ చేసింది. ఈ నేపథ్యంలో రోడ్డు నిర్మాణ పనులను అధికారులు చేపట్టారు. దీంతో నిర్మాణాన్ని గోపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. తమ భూమిలో రోడ్డు నిర్మించొద్దని అధికారులతో వాగ్వాదానికి దిగారు. రోడ్డు వేస్తే ఆత్మహత్య చేసుకుంటానని ఓ మహిళ కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసింది. అప్రమత్తమైన పోలీసులు అడ్డుకొని ఆమెను అదుపులోకి తీసుకున్నారు. న్యాయ స్థానం ఉత్తర్వుల మేరకు 7 మీటర్ల వెడల్పుతో రోడ్డు వేస్తున్నామని ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రవణ్ ప్రకాశ్ తెలిపారు.

సేంద్రియ పంటలతో ఆరోగ్యం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు భగ్‌వాన్‌రెడ్డి

తలకొండపల్లి: సేంద్రియ పంటలతో ఆరోగ్యం లభిస్తుందని, రైతులు సేంద్రియ వ్యవసాయాన్ని కొనసాగించాలని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సూచించారు. మండల పరిధిలోని చౌదర్‌పల్లిలో శుక్రవారం సర్పంచ్ చంద్రయ్య సహకారంతో వినతి వేదం ఆయుర్వేదిక్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భగ్‌వాన్‌రెడ్డి మాట్లాడుతూ అందరూ ఆరోగ్యం పట్ల తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రవికిరణ్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, స్కూల్ వైస్ చైర్మన్ మల్లయ్య, జంగయ్య, గోపాల్‌గౌడ్, శ్రీను, కృష్ణయ్య, మహేశ్, పరుశరాములు, మల్లయ్య, అశోక్, సాయిరెడ్డి, డాక్టర్ హెల్త్ కో ఆర్డినేటర్‌లు అశోక్, డాక్టర్ శ్రీలత, మానస, ఆపరేటర్ వికాస్ పాల్గొన్నారు.

అయోధ్య అక్షితల పంపిణీ



అక్షితలను పంపిణీ చేస్తున్న నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం మంగళపల్లి గ్రామంలో శుక్రవారం అయోధ్య అక్షింతల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మంగళపల్లి గ్రామంలోని హనుమాన్ ఆలయం నుంచి అయోధ్య అక్షితలను ఊరేగించారు. అనంతరం పలువురు నాయకులు ఇంటింటికీ పంపిణీ చేశారు. అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఈనెల 22న ప్రతి ఇంటిలో దీపాలు వెలిగించి పండుగ జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంగళపల్లి గ్రామ సర్పంచ్ తిప్పిరెడ్డి నర్సింహారెడ్డి, నాయకులు ప్రభు, వరికుప్పల శ్రీనివాస్, జంగయ్య, రాఘవేందర్, రామకృష్ణ, శేఖర్, శివ, శ్రీశైలం, పర్వతాలు, అశోక్, శివ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

తుర్కయంజాల్: వడ్డెర వృత్తిదారుల సంఘం క్యాలెండర్‌ను శుక్రవారం తుర్కయంజాల్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయిలు, ప్రధాన కార్యదర్శి విఘ్నేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వడ్డెరులు ఐకమత్యంగా ఉండాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వడ్డెర వృత్తిదారుల సోషల్ మీడియా కన్వీనర్ రామకృష్ణ, నాయకులు శ్రీనివాస్, సత్యం, బాలకృష్ణ, శ్రీధర్, వాసు తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

బస్ టెర్మినల్ ప్రారంభం



బస్ టెర్మినల్ ప్రారంభిస్తున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: అందరికి అందుబాటులో బస్ టెర్మినల్ ఉండాలని బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం బడంగ్‌పేట చౌరస్తాలో మిధాని డిపో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బస్ టెర్మినల్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు, ప్రయాణికులకు అందుబాటులో బస్ టెర్మినల్ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గౌర రమాదేవి, రాళ్లగూడెం సంతోష, వంగేటి ప్రభాకర్‌రెడ్డి, దర్శన్‌రెడ్డి, బాలు, మిధాని డిపో మేనేజర్ ఆంజనేయులు, శ్రీనివాస్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

తుక్కుగూడ: గిరిజన అభివృద్ధి కాంగ్రెస్‌తో సాధ్యమని మాజీ ఎమ్మెల్యే కిచ్చనగారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని బాసగూడతండాకు చెందిన గిరిజనులు ఆయా పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేఎల్లార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఆరు గ్యారంటీ పథకాల ద్వారా సామాజిక న్యాయం, అభివృద్ధి జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి ప్రతీకార్యకర్త పని చేయాలని ఆయన సూచించారు.



కాంగ్రెస్‌లో చేరుతున్న గిరిజన నాయకులు

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 21న ఫీనిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నానక్‌రామ్‌గూడ శంకర కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

స్వెటర్ల అందజేత



స్వెటర్లు అందజేసిన వెంకటేశ్, శ్రీనివాస్

కడ్తాల్: స్థానిక చెన్నకేశవస్వామి ఆలయ భజన బృందం సభ్యులకు మండల కేంద్రానికి చెందిన మిర్యాణం సాంబయ్య కుమారులు వెంకటేశ్, శ్రీనివాస్ రూ.10 వేల విలువ చేసే స్వెటర్లు అందజేశారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్వెటర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సాంబయ్య, శ్రీధర్, ప్రభులింగం, భజన బృందం సభ్యులు బాబు, శ్రీకాంత్, శ్రీనివాస్, శ్రీకాంత్, లక్ష్మయ్య, నారాయణ, శ్రీనివాస్‌చారి, సాయిరాం ఉన్నారు.

సదానందస్వామికి వివేకానంద సేవా అవార్డు

కందుకూరు: మండల పరిధిలోని అన్నోజిగూడకు చెందిన సదానందస్వామిముదిరాజ్.. స్వామి వివేకానంద సేవా పురస్కారాన్ని అందుకున్నారు. నవ భారతి నిర్మాణ ఫౌండేషన్ సంస్థ హైదరాబాద్‌లోని తెలంగాణ సరస్వతి పరిషత్ ఆడిటోరియంలో శుక్రవారం వివేకానంద జయంతి ఉత్సవాలు నిర్వహించింది. వివిధ రంగాల్లో సేవ చేస్తున్న వారిని ఎంపిక చేసి అవార్డులు ప్రదానం చేశారు. శాసన మండలి డిప్యూటీ చైర్మన్ ప్రకాష్‌ముదిరాజ్, ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా, మాజీ మంత్రి బాబు మోహన్, సదానందస్వామిని సత్కరించారు.

అక్రమాలను అరికట్టండి

కందుకూరు: మండలంలోని అన్నోజిగూడ, తిమ్మాయిపల్లి పరిధిలో జరుగుతున్న అక్రమాలను అరికట్టాలని కోరుతూ మాజీ ఉప సర్పంచ్ గొరైంకల యాదయ్య శుక్రవారం కలెక్టర్‌తో పాటు డీఆర్‌ఓ, ఆర్డీఓ, తహసీల్దార్‌కు వినతి పత్రాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తిమ్మాయిపల్లి సర్వే నంబర్ 15, కందుకూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 275 ప్రభుత్వ భూముల్లో కొందరు ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారని, ఇక్కడ నిర్మాణాలు సైతం కొనసాగుతున్నాయని తెలిపారు. మరోపక్క ప్రభుత్వ భూముల నుంచి అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడుతున్నారని, వీరిపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరామన్నారు.

రేపు సమైక్యత దినోత్సవ సమావేశం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో ఈ నెల 21న జైహో ఆధ్వర్యంలో హిందు, ముస్లిం సమైక్యత దినోత్సవ సమావేశం నిర్వహిస్తున్నట్లు జై భారత్ రాష్ట్ర కార్యదర్శి రాజు తెలిపారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం సమావేశానికి సంబంధించిన పోస్టర్లను స్థానిక నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ హిందు, ముస్లిం ఐక్యత కోసం ప్రాణాలు అర్పించిన స్వాతంత్ర్య సమరయోధులు అష్ఫాఖుల్లాఖాన్, రాంప్రసాద్ బిస్మిల్ వర్ధంతి డిసెంబర్ 19 నుంచి మహాత్మాగాంధీ వర్ధంతి జనవరి 30 వరకు సమైక్యత దినోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. హిందు, ముస్లింల ఐక్యత దేశానికి ఎంతో అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో జైభారత్ నాయకులు జహంగీర్ పాషా, శివ, అలీం, హరికృష్ణ, వినోద్, జావేద్, మున్నా పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు యాదయ్య

కడ్తాల్: ఉపాధ్యాయుల సమస్యలపై టీఎస్‌యూటీఎఫ్ నిరంతరం పోరాడుతుందని ఆ సంఘం మండల అధ్యక్షుడు యాదయ్య తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి టీఎస్ యూటీఎఫ్ 2024 క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సంఘం ఉద్యమిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏంఈఓ సర్దార్, హెచ్ఎం అరుణ, నోడల్ అధికారి జంగయ్య, టీఎస్‌యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి మల్లయ్యగౌడ్, ఉపాధ్యక్షులు జంగయ్య, కౌసల్య, జహంగీర్, ప్రవీణ్, విజయ్‌కుమార్, రాధాకృష్ణారెడ్డి, రవీందర్, జంగయ్య పాల్గొన్నారు.

రైతులను ఆదుకుంటాం

ఏఐసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి



మాట్లాడుతున్న కోదండరెడ్డి, సునీల్‌కుమార్

యాచారం: పుదీనా రైతులను ఆదుకుంటామని ఏఐసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు ముదిరెడ్డి కోదండరెడ్డి హామీ ఇచ్చారు. మొండిగౌరెల్లి గ్రామానికి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రిని తీసుకొచ్చి రైతుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. శుక్రవారం మొండిగౌరెల్లి గ్రామంలో పర్యటించిన ఆయన.. పుదీనా సాగులో ఇబ్బందులు, మార్కెట్ సౌకర్యం తదితర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కోదండరెడ్డి మాట్లాడుతూ పశువుల ఎరువుతో పుదీనా సాగు చేస్తున్నా.. మార్కెట్లో సరైన ధర లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారని తెలిపారు. పశువుల ఎరువుతో ఆకుకూరలు, కూరగాయల పంటలు పండించే రైతులకు ప్రత్యేకంగా గుర్తింపు కార్డులు జారీ చేసేలా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భూ న్యాయ నిపుణులు డాక్టర్ సునీల్‌కుమార్ కూడా పాల్గొన్నారు.

భారత్ వికసిత్ యాత్రను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న లచ్చిరెడ్డి తదితరులు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు లచ్చిరెడ్డి

మంచాల: భారత్ వికసిత్ యాత్రను ప్రజలు విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు గోగిరెడ్డి లచ్చిరెడ్డి కోరారు. ఈ నెల 21, 22, 25 తేదీల్లో మంచాల మండలంలో వివిధ గ్రామాల్లో యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం మంచాలలోని బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను భారత్ వికసిత్ యాత్ర ద్వారా ప్రజలకు వివరిస్తామని తెలిపారు. అయోధ్యలో శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా శని, ఆదివారాల్లో గ్రామాల్లో ఆలయాలను శుభ్రం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు వెంకట్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు బాషయ్య, మండల ఇన్‌చార్జి పాండాల జంగయ్య గౌడ్, నాయకులు శ్రీశైలం, రాజేందర్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రంగారెడ్డికి వినతి



రంగారెడ్డిని కలిసిన డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం డిగ్రీ కళాశాల నూతన భవనాన్ని రెండు నెలల్లో అందుబాటులోకి తెస్తామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం రంగారెడ్డిని కళాశాల ప్రిన్సిపాల్ ప్రభు, అధ్యాపకులు, సిబ్బంది కలిశారు. డిగ్రీ కళాశాల నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్యేకు వినతిపత్రంఅందజేశారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి మాట్లాడుతూ సంబంధిత అధికారులతో కళాశాల భవన నిర్మాణంపై చర్చించి రెండు నెలల్లో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

కందుకూరు: వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మేడి పాపయ్య నాయకత్వంలో ఏబీసీడీ వర్గీకరణ లక్ష్య సాధన కోసం నిరంతరం పోరాటం చేస్తున్నామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకుని అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లాలని డిమాండ్ చేశారు.

నూతన కమిటీఎన్నిక

ఎమ్మార్పీఎస్ టీఎస్ నూతన కమిటీలను ప్రకటించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాల్‌రాజు, కార్యదర్శిగా యాదయ్య, మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షుడిగా దాసు, కందుకూరు మండల అధ్యక్షుడిగా గడ్డం రాంచంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చిన్నగళ్ల బాల్‌రాజ్, అధికార ప్రతినిధిగా మంద కృష్ణను ఎన్నుకున్నారు.

కేంద్రం విధానాలపై పోరాడుదాం

- పేదలపై భారం మోపుతున్న మోదీ సర్కార్
- రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగారెడ్డి
- కందుకూరులో సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘాల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగారెడ్డి

కందుకూరు: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, మతోన్మాద. ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని రైతు సంఘం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.జంగారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని పాషానరహరి భవన్‌లో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు డి.రాంచందర్ అధ్యక్షతన రైతు, సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో పేదలు నిరుపేదలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ ప్రజలపై మోయలేని భారాన్ని మోపుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేస్తున్నారని మండిపడ్డారు. రాజకీయాలతో మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నారని, లేబర్ కోడ్ బిల్లుతో కార్మిక రంగం కుదేలయ్యేలా చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఫిబ్రవరి 16 వరకు కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో మూడు సంఘాలు సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు జిల్లా వ్యాప్తంగా ఇంటింటికి వెళ్లి ప్రజలకు ప్రచారం చేయాలన్నారు. మోదీ దుర్మార్గపు పాలనను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.రాజు, ఎం.చంద్రమోహన్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.అంజయ్య, కె.జగన్, నాయకులు జగదీశ్, కిషన్, సీహెచ్ జంగయ్య, స్వప్న తదితరులు పాల్గొన్నారు.